క్లుప్తంగా

32 మంది గేట్స్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన గేట్స్ విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇంజినీరింగ్, ఎంసీఏ ఫైనలియర్ చదువుతున్న 32 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. ఇందులో అత్యంత ప్రతిభ కనబరిచిన 32 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఒక్కొక్కరికి వార్షిక వేతనం రూ.4 లక్షలు ఇవ్వనున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, సీఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్ అభినందించారు.

విజిలెన్స్ తనిఖీలు

తాడిపత్రిటౌన్: మండలంలోని చిన్న పోలమడ వద్ద ఉన్న చౌకధాన్యపు డిపోలో శుక్రవారం విజిలెన్స్ అండ్ రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గోడౌన్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఫిర్యాదు మేరకు దాడులు చేసినట్లు విజిలెన్స్ సీఐ రామారావు తెలిపారు. స్టాక్ రిజిస్టర్ గోడౌన్‌లో నిలువున్న రేషన్ స్టాకును పరిశీలించి రికార్డుల ప్రకారం సక్రమంగానే గోడౌన్‌లోని సరుకు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. శనివారం గోడౌన్‌లోని సరుకును మరోసారి పూర్తిస్థాయిలో తనిఖీ చేస్తామన్నారు. అనంతరం గోడౌన్‌కు సీజ్ చేసారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్‌ఐలు జైపాల్‌రెడ్డి, శేషగిరి, తహశీల్దార్ అలెగ్జాండర్ పాల్గొన్నారు.


పరిశ్రమ విస్తరణ మంచిదే



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

యాడికి: పెన్నా సిమెంట్ కర్మాగారం పరిశ్రమ విస్తరణలో భాగంగా ప్రజాభిప్రాయాలను సేకరించారు. శుక్రవారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన యాడికి మండలంలోని బోయరెడ్డి పల్లె వద్ద ఉన్న పెన్నా సిమెంట్ కర్మాగారం యాజమాన్యం మండలంలోని గుడిపాడు గ్రామం వద్ద అమాల్గమేటెడ్ గుడిపాడు సున్నపరాయి గని కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కాలుష్య మండలి పర్యావరణ ఇంజనీర్ కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడిపాడు, కుందనకోట, కొలుపల్లె గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారు. గుడిపాడు సర్పంచు దండు సావిత్రి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు మాట్లాడుతూ పెన్నా సిమెంట్ యాజమాన్యం కుందన కోట గ్రామంలో మంచినీటి సౌకర్యాన్ని ఇంటింటికీ అందించడమే కాకుండా రోడ్లు, పంచాయతీలో చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వాలన్నారు. అధికశాతం మంది పరిశ్రమ విస్తరణ మంచిదేనని అభిప్రాయపడ్డారు.


ధర్మప్రచార వారోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ఆహ్వానిస్తున్న దృశ్యం

తాడిపత్రి: పెద్దపప్పూరు మండలం అశ్వత్థనారాయణస్వామి ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ధర్మప్రచార వారోత్సవాలకు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆహ్వానించారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రిక అందించారు. ఈనెల 23 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడాపోటీలు



ఖోఖో జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఎస్కేయూ అంతర్ కళాశాలల మహిళ క్రీడా పోటీలు శుక్రవారం ముగిసినట్లు కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి తెలిపారు. ఖోఖోలో శ్రీ శంకరానంద గిరిస్వామి(గుంతకల్లు), టేబుల్ టెన్నిస్‌లో ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(కదిరి), బ్యాడ్మింటన్‌లో ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల(అనంతపురం), చెస్‌లో ఎస్వీ డిగ్రీ కళాశాల (అనంతపురం) జట్లు గెలిచాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో ఆర్ట్స్ కళాశాల(అనంతపురం), వాలీబాల్ ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల (అనంతపురం), కబడ్డీ కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అనంతపురం), బాస్కెట్ బాల్ పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల (అనంతపురం) గెలుపొందాయి. విజేతలకు కప్‌లను అందజేశారు. ప్రిన్సిపాల్ గోపాల్, రిటైర్డ్ పీడీ నాగార్జునప్రసాద్, కళాశాల పీడీ మహబుబ్‌బాషా, పీఈటీ బీ.కృష్ణయ్య ఉన్నారు.

జగనన్నతోనే భావితరాలకు భవిష్యత్తు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



రైల్వే జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

• వై ఏపీ నీడ్స్ జగన్ సభలో ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పేద పిల్లలకు కార్పొరేట్‌స్థాయి విద్యను ఉచితంగా అందిస్తూ భావితరాలకు బంగారు బాటలు వేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం 8వ సచివాలయం పరిధిలో వార్డు ఇన్‌చార్జ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సచివాలయం బయట పార్టీ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఏకైక సీఎం జగన్ అని పేర్కొన్నారు. జగనన్న చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. అతిత్వరలోనే గుంతకల్లు శివార్లో రూ.1000 కోట్లతో సోలార్ పవర్ గ్రిడ్ ఏర్పాటుకు చర్యలు వేగవంతంగా జరుగుతున్నాయని, తద్వార స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ మల్లికార్జున, యువనేత సిబి.మంజునాథరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, మాజీ చైర్మన్ రామలింగప్ప, జేసీఎస్ కన్వీనర్లు రామాంజనేయులు, ఎండీ.ఖలీల్, మాజీ కన్వీనర్ ఎద్దుల శంకర్, వార్డు ముఖ్యనాయకులు చక్రవర్తి, పాపన్న, రామాంజినేయులు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు అభివృద్ధికి సహకరించండి

గుంతకల్లు: గుంతకల్లు అభివృద్ధికి సహకరించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డీఆర్ఎం మనీష్‌అగర్వాల్ ఛాంబర్‌లో రైల్వే జీఎంను కలిసి మాట్లాడారు. ప్రధానంగా ధర్మవరం రైల్వే ఎల్‌సీ గేట్ స్థానంలో ఆర్‌యూబీ నిర్మాణం, సత్యనారాయణపేటలోని కసాపురం రైల్వేమోరీ విస్తరణతోపాటు ఎస్‌జేపీ–రోటరీ హైస్కూల్ మధ్య ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయమై చర్చించారు. ధర్మవరం గేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి అన్ని అడ్డంకులు తొలిగిపోయాయని ఆయన దృష్టికి తెచ్చారు. కసాపురం మోరీ వద్ద టూవే రూపంలో నిర్మాణం చేపడితే కసాపురం క్షేత్రం వచ్చే భక్తులు, పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. ఈ విషయమై జీఎం డీఆర్‌ఎంతో మాట్లాడగా దాదాపు రూ.8.30 కోట్లతో ఆర్‌యూబీ నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. హెవీ వెహికల్స్ వెళ్లకుండా ఉండేందుకు కేవలం 5 అడుగుల ఎత్తు మేర నిర్మిస్తున్నట్లు వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జీఎం ఎమ్మెల్యేకు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.రామలింగప్ప, పట్టణ మాజీ అధ్యక్షుడు ఎద్దుల శంకర్, సీనియర్ నాయకులు జానకిరామయ్య, మల్లికార్జునశ్రాస్తి, నాయకులు సీఎం బాషా, తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువకులకు ఎమ్మెల్యే పరామర్శ

గుంతకల్లుటౌన్: పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురై ఆస్పత్రి పాలైన పట్టణానికి చెందిన ముగ్గురు యువకులను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు. శుక్రవారం ఉదయం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చైతన్య, కిరణ్, ఖాజాబందేనవాజ్‌ల ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే వైద్యులను ఆరా తీశారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బైక్ చోరీ కేసు విచారణ పేరుతో తమ పిల్లలను తీసుకెళ్లిన కానిస్టేబుల్ జాఫర్‌మైనూ రెండు రోజులపాటు పిల్లల్ని చిత్రహింసలకు గురిచేశాడని ఆరోపించారు. ఈవిషయమై జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిపిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ప్రజలకు పూర్తిస్థాయిలో పథకాలు అందాలి



దిమ్మగుడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

• తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా చూడాలని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం దిమ్మగుడి, కండ్లగూడూరు, గంజిగుంటపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దిమ్మగుడి గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్నా పథకం అందలేదని ఫిర్యాదులు ప్రజల నుంచి రాకూడదన్నారు. విధులకు సరిగా హాజరుకాకపోవడం , ప్రజలను ఇబ్బంది పెట్టడంలాంటివి చేస్తే సహించబోమని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించడంలో ప్రతి ఒక్కరూ సహాయ పడాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తర్వాత ప్రజలతో సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్మన్ కొట్టాలపల్లి హరినాథరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శేషారెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు సూర్యచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, ఓబిలేసు, కండ్లగూడూరు సర్పంచ్ నాగిరెడ్డి, ఈశ్వరయ్య, హంపిరెడ్డి, రవీంద్రారెడ్డి, జయలక్ష్మీరెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ సిరులు

• ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఇంటింటా సంక్షేమ సిరులు కురుస్తున్నాయని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 8వ వార్డు కౌన్సిలర్ బి.అరుణకుమారి, వార్డు ఇన్‌చార్జ్ సుంకప్పలతో కలిసి ఎమ్మెల్యే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ ఇంటింటికీ తిరుగుతూ ప్రజల యోగక్షేమాలను తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. వార్డు సచివాలయ, వలంటీర్ల ద్వారా అందుతున్న సేవలు, వారి పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్నా సాంకేతిక కారణాల చేత పథకాలు అందని వారి పేర్లను నమోదు చేయించారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలకతీతంగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని చెప్పారు. జగనన్నకు చల్లని దీవెనలందించాలని ఆయన కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ యువనేత మంజునాథరెడ్డి, మాజీ చైర్మన్ రామలింగప్ప, కమిషనర్ మల్లికార్జున, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్.మోహన్, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

త్యాగరాజు కుటుంబ సభ్యులకు పరామర్శ

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కసాపురం ట్రస్ట్ బోర్డు సభ్యుడు ఎం.త్యాగరాజు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించి వారికి సానుభూతిని తెలియజేశారు. శుక్రవారం వారి నివాసానికి ఎమ్మెల్యే, పార్టీ నాయకులు వెళ్లి త్యాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన



గన్నెవారిపల్లి కాలనీ సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. గన్నెవారిపల్లి కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై కాలనీ వాసులతో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పథకాలు పొందాలంటే టీడీపీ నేతల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన దుస్థితి ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే ఇంటి గుమ్మం వద్దే పథకాలు అందుతున్నాయన్నారు. నాయకులు ప్రదీప్‌రెడ్డి, రమికుమార్, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రణయ్‌రెడ్డి, ప్రభాకర్, రాజారెడ్డి, గడ్డం పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



తాడిపత్రి 18వ వార్డు వాసులతో మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో సమస్యలపై ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాబయ్య, పట్టణాధ్యక్షుడు జావీద్, వక్ఫ్‌బోర్డ్ సెక్రటరీ బాబా, కౌన్సలర్లు చిన్ననాగిరెడ్డి, రంగనాథరెడ్డి, మార్కండేయ ఆలయ ప్రెసిడెంట్ గడం గణేష్, జేసీ సూర్యనారాయణరెడ్డి, అయూబ్‌బాషా, రంగనాథరెడ్డి, రామకృష్ణ, మనోజ్ కాశి, బషీర్, రఘు, అశోక్, సాయి, కులశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాడికి: జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిట్టూరు గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామస్తులతో సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శివప్రసాద్, నాయకులు రామాంజులరెడ్డి, చలపతిరెడ్డి, జయకృష్ణ, కోనా జగదీశ్వర రెడ్డి, కోనా వెంకటశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మ ప్రచార వారోత్సవాలు



కుంకుమార్చన చేస్తున్న భక్తులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం ధర్మ ప్రచార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ముఖమండపంలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో సామూహిక సహస్ర నామ కుంకుమార్చన చేపట్టారు. అనంతరం కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ చింతా మునుస్వామి ఆధ్వర్యంలో హిందూ ధర్మంపై ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం వందలాది మంది మాలధారులు, భక్తులతో కలిసి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి కూచిపూడి నాట్యప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను జరిగాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గుంతకల్లు రూరల్: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కసాపురం పోలీస్ స్టేషన్‌లో కసాపురం ఎస్‌ఐ గోపాలుడుతో కలిసి ఆయన ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకూడదని, ప్రయాణికుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. రికార్డులు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయండి

గుత్తి రూరల్: తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలని తహసీల్దార్ మహబూబ్ బాషా బీఎల్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో మునిసిపాలిటీ, రూరల్ బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. డీటీలు శ్రీలత, లలిత, ఆర్‌ఐ సందీప్, మునిసిపల్ మేనేజర్ మురళీధర్, కార్యదర్శులు ధనలక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు.

మిరప పంట తొలగింపు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో రైతు ఎద్దుల ఆదినారాయణరెడ్డి సాగు చేసిన మిరప పంటను శుక్రవారం తొలగించారు. నాలుగు ఎకరాల్లో పంట సాగు చేయగా తీవ్రవర్షాభావంతోపాటు పంటకు తెగుళ్లు సోకడంతో తొలగించినట్లు రైతు తెలిపాడు.

గంజాయి ముఠా అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు,ఫోన్లు

గుంతకల్లుటౌన్: గంజాయిని సరఫరా చేస్తున్న ముఠాను గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 28 ప్యాకెట్లల్లో నిల్వ ఉంచిన 80 గ్రాముల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు. సీఐ వివరాల మేరకు.. షికారీ కాలనీకి చెందిన షికారీ రామదాస్ మహారాష్ట్రలోని లోహర పట్టణానికి వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తితో గంజాయిని కొనుగోలు చేసి స్థానికంగా అధిక ధరకు విక్రయించేవాడు. అతని నుంచి అనంతపురం అశోక్‌నగర్‌కు చెందిన గుజ్జల యశ్వంత్‌కుమార్, ముదిగుబ్బ మండలం చిన్నకోట్లకు చెందిన అలిగే శివానందరెడ్డి గంజాయి కొనుగోలు చేసి అయా ప్రాంతాల్లో విక్రయించేవారు. శుక్రవారం వీరిద్దరూ గుంతకల్లుకు వచ్చి షికారీ రామ్‌దాస్ నుంచి గంజాయిని తీసుకుని అనంతపురం వెళ్లేందుకు పాత రైల్వేబుకింగ్ ఆఫీసు వద్ద ఉన్నట్లు సమాచారం వచ్చింది. దీంతో అక్కడి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని విచారించాము. అక్కడి నుంచి నేరుగా షికారీ కాలనీకి వెళ్లి రామ్‌దాస్‌ను పట్టుకున్నారు. ఈ ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన హోమ్‌గార్డ్ శంకర్‌ను సీఐ అభినందించారు.

పవర్ గ్రిడ్‌కు స్థల పరిశీలన

గుంతకల్లు రూరల్: తిమ్మాపురం, దోనిముక్కల మధ్యలో పవర్ గ్రిడ్ ఏర్పాటు కోసం సేకరించిన 54 ఎకరాల స్థలాన్ని శుక్రవారం ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి పరిశీలించారు. తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, పవర్ గ్రిడ్ మేనేజర్ రవికుమార్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ పూర్తిగా సర్వే చేసి నివేదిక సమర్పించాలని సిబ్బందికి సూచించారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనారాయణ

గార్లదిన్నె: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎంపీపీ వెంకటనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఉచితంగా వంట పాత్రలు అందజేశారన్నారు. మండలంలో రెగ్యులర్ విద్యుత్ ఏఈ లేక పోవడంతో రైతులకు ఇబ్బందులు ఉన్నాయని, వెంటనే ఏఈని నియమించాలని ఎంపీటీసీ ,సర్పంచులు కోరారు. వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ బాబా యూనీస్, ఎంపీడీఓ విజయ భాస్కర్, తహసీల్దార్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

కందిలో యాజమాన్య పద్ధతులు అవసరం

బుక్కరాయసముద్రం: రైతులు కంది పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్జీరంగా విశ్వ విద్యాలయం పప్పుధాన్యాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రమణ పేర్కొన్నారు. శుక్రవారం రేకులకుంటలో సాగు చేసిన కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం కంది పంట బెట్ట పరిస్థితుల్లో ఉందన్నారు. బెట్ట నివారణకు ట్రాక్టర్ ద్వారా నీటి తడులు ఇవ్వడంతో పాటు 19.19.19 ఒక కిలో చొప్పున 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట పూత దశలో ఉందని, పచ్చపురుగు లార్వాను తినుటకు అనుగుణంగా ఎకరాకు 10–15 పక్షి స్థావరాలు ఏర్పర్చుకోవాలన్నారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆరోపణలతోనే విచారణకు పిలిచాం

గుంతకల్లు: ఉరవకొండ పోలీసుస్టేషన్ పరిధిలో బైక్ చోరీ కేసులో ఆరోపణలు రావడంతో యువకులను స్టేషన్ పిలిచించామే తప్ప వారిపై ఎలాంటి ఉద్దేశం లేదని అడిషనల్ ఎస్పీ ఆర్.విజయ్‌భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బైక్ చోరీ కేసులో గుంతకల్లుకు చెందిన ముగ్గురు యువకులను ఉరవకొండ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాదిన విషయమై ఏఎస్పీ గుంతకల్లుకు విచ్చేశారు. విచారణ అనంతరం డీఎస్పీ నరసింగప్పతో కలిసి మాట్లాడారు. ఉరవకొండ సర్కిల్ పరిధిలో బైకు దొంగతనాల కేసులు చాలా నమోదయ్యాయన్నారు. ఈ నేపథ్యంలోనే గుంతకల్లులో మహేష్ అనే వ్యక్తి నడుపుతున్న సర్వీస్ సెంటర్‌లో బైక్ దొంగతనం జరిగిందన్నారు. అక్కడి సీసీ ఫుటేజీ పరిశీలించగా భాగ్యనగర్‌కు చెందిన ఖాజవలి ఎత్తుకెళ్లినట్లు మహేష్ గుర్తించడంతో అతన్ని విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్లు చెప్పారు. విచారణలో ఖాజావలి చైతన్య, కిరణ్‌బాబు పేర్లు చెప్పడంతో వారిని సీఐ విచారణ నిమిత్తం పిలిచారన్నారు. చైతన్య, కిరణ్ బాబు తమకు సంబంధం లేదని చెప్పడంతో వారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. పిల్లలపై ఆరోపణ రావడంతో విచారణకు తీసుకువచ్చావని, పూర్తిస్థాయి విచారణ జరిపి విషయం తెలిజేస్తామని చెప్పామన్నారు. అయితే సీసీ ఫుటేజీ ఆధారంగా తమపై కేసు పెడతారని భయంతో వారు ఆస్పత్రిలో చేరినట్లు భావిస్తున్నామన్నారు. యువకుల తల్లిదండ్రుల ఫిర్యాదు కానిస్టేబుల్ జాఫర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఇద్దరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కోళ్లఫారం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..ఊబిచెర్ల గ్రామానికి చెందిన ధనుంజయ, రామకృష్ణ బైక్‌పై వస్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో పరస్పరం ఢీకొన్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ధనుంజయను వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

పుట్లూరు: గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఓబుళాపురం, దోశలేడు, కందికాపుల, మడ్డిపల్లి, సూరేపల్లిలో చోరీలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

గుత్తి: బాలల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అని ఎంఈఓ రవినాయక్ అన్నారు. కేజీబీవీలో శుక్రవారం ఎస్ఓ రుద్రాక్షి అధ్యక్షతన ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, ఏఎస్‌ఐ ఆజాద్, 1098 కో–ఆర్డినేటర్ బాలాజీ పాల్గొన్నారు.

రేపు గుడికట్ల సంబరాలు

గార్లదిన్నె: అనంతపురంలో ఆదివారం గుడికట్ల సంబరాలు నిర్వహించనున్నట్లు కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో కురుబ సంఘం ఆధ్వర్యంలో గుడికట్లు సంబరాల పోస్టర్లు విడుదల చేశారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కృష్ణమూర్తి,బీరన్న, గార్లదిన్నె మండలాధ్యక్షులు పాండు, లింగమయ్య, బ్యాళ్ల ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై అవగాహన

పామిడి: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఓఆర్డీ బీవీ శశికళ మాట్లాడుతూ పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 13 సచివాలయాల సిబ్బందికి, మిగతా 5 సచివాలయాల సిబ్బందికి పాళ్యం యూపీ పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎంఈఓ–2 సత్యనారాయణ, ఈఓ పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

బుక్కరాయసముద్రం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సీఐ నాగార్జునరెడ్డి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ సూచించారు. పాఠశాల హెచ్ఎం వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

గుత్తి రూరల్: అనారోగ్యంతో కర్నూలులో చికిత్స పొందుతున్న ఊబిచెర్లకు చెందిన వైస్ ఎంపీపీ నాగేశ్వరమ్మ భర్త లక్ష్మీనారాయణను శుక్రవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ రామంగారెడ్డి, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి మల్లికార్జున ఉన్నారు.

గొర్రె పిల్లకు శస్త్ర చికిత్స

శింగనమల: స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం గొర్రెపిల్లకు శస్త్రచికిత్స చేశారు. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన రమేష్ గొర్రె పిల్ల మలద్వారం లేకుండా పుట్టింది. వెటర్నరీ ఏడీ పద్మనాభం, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి గొర్రె పిల్లకు శస్త్ర చికిత్స ద్వారా మల ద్వారం ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినులు

యల్లనూరు: జిల్లా కేంద్రంలో జరిగిన జాతీయ సైన్సు పోటీల్లో యల్లనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గుల్నాజ్, బయిషా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. విద్యార్థినులతోపాటు సైన్స్ ఉపాధ్యాయుడు రామకోటిరెడ్డి, హెచ్ఎం రత్నమ్మను ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి అభినందించారు.

సుంకులమ్మ ఆలయంలో చోరీ

పెద్దవడుగూరు : గుత్తిఅనంతపురం సమీపంలోని సుంకులమ్మ ఆలయంలో జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ఆలయంలో ప్రవేశించి హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. గ్రామ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, గ్రామపెద్దల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలిని పరిశీలించారు. హుండీలో దాదాపు రూ.10 వేల ఉండొచ్చని భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

నెట్టికంటుడి సన్నిధిలో పత్తికొండ ఎమ్మెల్యే

గుంతకల్లు రూరల్: పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, సిబ్బంది స్వాగతం పలికారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846